# గ్రేషమ్స్ లా

కె. కె. మీనన్




వెంకన్న ఎవరివాడో ?

వెంకన్న ఎక్కడివాడో ?

ఇలాంటి చొప్పదంటు ప్రశ్నలు ఇంత వరకూ ఎవరి మేధస్సులోనూ ఉదయించలేదు. అప్పుడప్పుడూ కరణం గారి తలబోడి చెల్లెలు తాయారు బోడి గాని తలపుల్లో తప్ప !

ఇంతవరకూ తన చరిత్ర ఎవరికీ తెలియదని నమ్మిన వెంకన్నకు ఆ రోజున ఆ మాట విన్నాక తన నమ్మకం వమ్మయి పోయినట్టు తెల్సుకున్నాడు.

మళ్ళీ అదే మాట !

"వాడా, దొంగ వెధవ ! పక్క వూళ్ళో మక్కె విరగదంతే పారిపోయి వచ్చి కరణంగారి నీళ్ళ కావిడి మోస్తున్నాడు"

బరువు కాడి కొంచెం సేపు దించుకుని ఉరిమి చూస్తూ నించున్నాడు వెంకన్న.

"నాయాల్ని కావిడి బద్దతో కాళ్ళిరగ తందును, అక్కడ అమ్మగారు నీళ్ళ కోసం సూత్తుంటరుగాని" అని మౌనం గానే అనుకుని కండలుతిరిగిన తన కాయాన్ని కళ్ళతో ఒకసారి తడివి చూసుకున్నాడు. పైవూళ్లో పంతులుగారు వేసిన వాతల మచ్చలు మచ్చుకైనా కన్పించటం లేవు.' ఆ పోకిరీ వెధవ... పక్కవూళ్లో పేకాట కెళ్ళి, తన్నులు తినొచ్చిన కుర్రకుంక. కావలి కుక్కలా మున్సబుగారి కచేరిచావిట్లో కాలం వెళ్ళ బుచ్చే సోమరి ... వెంకన్న అదృష్టం తనకు పట్టలేదని గుండెల్లో నిప్పులు రగుల్చుకుంటూ తాయారు దివ్య రూపాన్నే నిత్యం తల్చుకుంటూ కోనేటి దారిలో కాపు వేసీ ఆ పోకిరీ వెదవ కామెంటుకు వెంకన్న ఒళ్ళు రైలు ఇంజన్లా మండి పోయింది.

"కోతి నాయాల ! యీ సికెందుకో !' పంతులుగారి పిల్లోడి మెళ్ళో పులిగోరు తీత్తే తన్నాడు. యీడి బాబు సొమ్మే మన్నా తీసానా ?"

అని మరోసారి అనుకుని ఎందు కైనా మంచిదని కావిడి భుజాన్నేసు కుని బరువుతో లయగా కాయాన్ని ఊపుకుంటూ వెళ్ళిపోయాడు.

అక్కడ....

తెరిచివున్న కరణంగారి మండువా లోగిలి దొడ్డి తలుపు దగ్గర ఎన్నడూ కాటుకకు నోచుకోని జత కాటుక కళ్ల ఆతృతగా, భీతిగా అతని కోసం వేచి వున్నాయి.

"ఆ కావిడి అక్కడ పారేసి పారిపో వెంకన్నా" అన్నది తాయారు కంగారుగా.

ఆ మాటలు అతని మనస్సును స్పృశించినట్లు లేదు.

"నిన్నే, పారిపో ..."

"ఏంటండమ్మగోరూ ?"

"అన్నయ్య నిన్ను చంపేస్తానని చిందులేస్తున్నాడు పో....పారిపో...."

"ఎందుకండే ?"

"ఇప్పుడవన్నీ చెబుతూ కూర్చొనే సమయంలేదు"

"అయితే మరెట్టాగుండమ్మగోరూ, తెల్సుగోకుం డెట్టాపోయేదీ ?"

"అబ్బా ! నువు ప్రాణాలు విసి గిస్తావు. మన గురించి ఎవడో ఆకాశ రామన్న ఉత్తరం రాశాడుట. అది చూసి మండిపోతూ మున్సబుగారింటి కెళ్ళేడు. తిరిగొచ్చేవరకూ ఇక్కడే వున్నావంటే వాళ్ళిద్దరూ కల్సి నిన్ను పాతేసారు" అంది ఆందోళనగా.

"వెళ్ళు వెంకన్నా, నా మీద ఒట్టే."

తిరుగులేని బాణమే అది. అయినా కదల్లేకపోతున్నాడు వెంకన్న. వదల్లేక పోతున్నాడు తాయారును. ఇహ లాభం లేదనుకుని బలవంతంగా బయటికి నెట్టేసి, తలుపేసుకుని కంట నీరెట్టు కుంది పాపం తాయారు ! మూర్రోజుల

క్రితమే ముచ్చటపడ్డ మున్సబుగారి రూపం ఆమె మనసులో మసగ మసగ్గా మెసల సాగింది.

పక్కవూరి పంతులుగారు ఆకస్మికంగా గుర్తుకొచ్చారు వెంకన్నకు. అటు పిమ్మట మున్సబుగారి భీకరాకారం తరుంతున్నట్లు అనుభూతిపొంది, గొడ్ల చావిట్లో చిలక్కొయ్యను వేళ్ళాడుతున్న సైను చొక్కా భుజాన్నేసుకుని అదే పరుగున రైలు స్టేషన్‌కు దౌడు తీశాడు. అప్పుడే కూతేసి కదలబోతోంది రైలు. చేతికందిన ఇనుపకడ్డీ పటుకుని పెట్టెలోకి దూరాడు. చొక్కా తొడుక్కుని ఒక మూలగా ఒదిగి కూర్చున్నాడు.

టికెట్టు లేని ప్రయాణం ప్రాణ సంకటమైంది వెంకన్నకు. టి. టి. యి. ఎట్లా వుంటాడో ఎరుగని వెంకన్న కాస్త షోగ్గా ... ఫేంటూ, షర్టూ వేసుకున్న ప్రతి వాణ్ణీ చూసి వణికి పోతున్నాడు. రైలాగిన చోటల్లా దిగి మళ్ళి ఎక్కుతున్నాడు.

రైలాగింది.

అదేం స్టేషనో ఏమో ! ! మహా సందడిగా వుంది. మువ్వన్నె పతాకాలతో, ముతక గుడ్డ టోపీలతో జనం కోలాహంగా వున్నారు పిడికెళ్ళు బిగించి ఆవేశంగా అరుస్తున్నారు.

"వందే మాతరం – మందే రాజ్యం

"ఇంక్విలాబ్ – జిందాబాద్"

అంతా రైల్లో జొరబడుతున్నారు.

ఆ గుంపులో గుట్టుగా కల్సిపోయాడు వెంకన్న

* * *

పందొమ్మిది వందల నలభై ఏడో సంవత్సరం – ఆగస్టునెల పద్నాలుగో తేదీ రాత్రి పన్నెండు గంటల ఒక్క నిముషానికి దేశమాత దాస్యశృంఖలాలు పుటుక్కున తెగిపోయాయి.

అంతకుముందే చెరసాలల తలుపులు తెరుచుకున్నాయి. లాకులెత్తిన నీటి ఉదుటున బంధితులంతా బయటికి దూకారు

బయట ఒకటే జనసంకులం !

చేతుల్లో త్రివర్ణ పతాకాలూ, ఖద్దరు మాలలూ వున్నాయి.

మరికొంతమంది చేతుల్లో కెమెరాలున్నాయి.

ఒక ఆసామి పద్మవ్యూహాన్ని ఛేదించిన అభిమన్యుడిలా ముందుకు వచ్చి అడిగాడు – విముక్తుడైన ఒక వ్యక్తిని.

"తమ పేరు ?

"వెంకట్రావు...."

"మన నాయకులు వెంకట్రావుగారు.......కళా వెంకట్రావుగారు...."

గుసగుసలు తొక్కిసలాటలు.

జేజేలు మిన్ను ముట్టాయి. వెంకట్రావుగారి మెళ్ళో ఖద్దరు మాలలు పడ్డాయి.

కెమెరాలు "క్లిక్" మన్నాయి.

ఫ్లాష్ లైట్లు తళుక్కు మన్నాయి.

ఆ మర్నాడు వెంకట్రావుగారి ఫోటో పత్రికలో వచ్చింది. అది చూసిన కరణంగారు,

"అరె! మన వెంకన్నలాలేదూ!!" అని అబ్బుర పడ్డారు.

మూడోనాటి పత్రికలో సవరణ వచ్చింది. ఆ రోజున వేసిన ఫొటో కళా వెంకట్రావుగారిది కాదనీ, మరో దేశభక్తుడు వెంకట్రావుగారి దనీను, కాని అప్పటికే వెంకట్రావుగారి పేరు వాడ వాడలా మార్మోగి పోయింది. కాంతి కిరణంలా నలుదెసలా వారి రూపం ప్రసరించింది.

స్వతంత్రాగమనంతో వెర్రివెంకన్న వెంకట్రావై పోయాడు.

* * *

దిక్కులేని వెంకట్రావుకు దిక్కు తోచని తరుణంలో ఎదుట తాయారు నిలబడి చేతులు చాపి నట్లనిపించింది. మనసులో భయం పొడసూపినా... స్వతంత్రం సంగతి గుర్తుకొచ్చి నిర్భయంగా తాయారు దిక్కుకే పయనమై పోయాడు.


ఊళ్ళో ఆదరణ బాగానే లభించింది వెంకట్రావుకు. తాలూకా కార్యకర్త లంతా అతనికి బ్రహ్మరథం పట్టారు.

వెంకట్రావుగారి ఆగమనాన్ని పురస్కరించుకుని స్థానిక పురమందిరంలో ఒక సభ ఏర్పాటయింది. అనారోగ్య కారణంగా అంతకు ముందే జైలు నుంచి విడుదలైన దేశభక్తులు, జిల్లా నాయకులు అయిన శ్రీ మహర్షిగారు సభకు అధ్యక్షత వహించారు.

కార్యదర్శి సభకు మహర్షిగార్నిలా పరిచయం చేశారు.

"మహర్షిగారి పేరు విననివారుండ రనుకుంటాను. అయినా ఈ సందర్భంలో వారిని గురించి నాలుగు ముక్కలు చెప్పటం నా విధిగా భావిస్తున్నాను. మహర్షిగారు మన జిల్లాకు ఏకైక నాయకులు. ఎంత కాలంగానో వీరు రాజకీయరంగంలో వుంటూ ఎన్నో ఇక్కట్లను అనుభవించారు. గాంధీమహాత్మునితో దండి సత్యాగ్రహంలో పాల్గొని కఠినశిక్ష అనుభవించారు. భరతమాత బంధవిమోచనకై అహర్నిశలూ శ్రమించి తమ సర్వస్వాన్నీ తృణప్రాయంగా త్యజించిన త్యాగమూర్తులు. బిడ్డలకు వర్ణాంతర వివాహాలు చేసిన సంస్కారులు. వీరీ సభకు అధ్యక్షులుగా అమరటం ఎంతైనా ముదావహం. ప్రస్తుతం జైలునుంచి విడుదలై వచ్చిన స్వతంత్ర యోధుల, దేశభక్తులు శ్రీ వెంకట్రావుగారిని సభకు పరిచయం చేయాల్సిందిగా శ్రీ మహర్షిగారిని కోరుతున్నాను."

కరతాళ ధ్వనులమధ్య మహర్షిగారు




ఉపన్యాసం ప్రారంభించారు.

"దేశభక్తులారా! భరతమాత ముద్దు బిడ్డలారా!! మేమంతా మీరు చేసిన నాయకత్వం, మీ అండదండలు, సహకార సానుభూతులూ లేకుంటే దేశ స్వాతంత్ర్యం సాధ్యపడేది కాదు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఈ శుభ తరుణంలో మిమ్మల్ని అభినందించటంకంటె నేను మాట్లాడగలిగింది ఏమీలేదు. ఇక పోతే ఇక్కడ మీ ముందున్న సోదరుడు, స్వతంత్రయోధుడూ, అయిన వెంకట్రావుగారిని సభకు పరిచయం చెయ్యాల్సిందిగా కార్యదర్శిగారు నన్నాదేశించారు. ఈ కార్యభారాన్ని నాపైన వేసినందుకు వారికి నా ధన్యవాదాలు. కాని వారు ఆదేశించినట్టుగా నా ధర్మాన్ని నేను నిర్వర్తించలేకపోతున్నందు చాలా విచారిస్తున్నాను. ఎందుకంటె సోదరుడు వెంకట్రావుగారిని గురించి భోగట్టా నాకంతగా తెలీదు. మీరీ వి యంలో నన్ను మన్నిస్తే స్వతంత్ర సమరంలో తమ అనుభవాలని నాలుగ ముక్కల్లో సభకి చెప్పవల్సిందిగా వారి కోరుతాను"

"మాట్లాడాలి .... వెంకట్రావుగా గారు మాట్లాడాలి ...." సభలో కలకల లేచింది.

కరణం డొక్కలో పొడిచాడ మున్సబు

"ఎంత పొగరు! చూశారా ఎల మడతపేచీ పెట్టి తప్పుకున్నాడో."

లేవండి ఇప్పుడు మీరే మాట్లాడాలి

కార్యదర్శి వెంకట్రావును లేపాడు.

వెంకట్రావు మైక్ దగ్గరకొచ్చి.

"బత్తులారా !" అని ఒక గావుకేక పెట్టాడు. శ్రోతలంతా చెవులు మూసుకున్నారు.

"దొరలంతా సొస్స్వాక నాం జెప్పే దేంటి ? సత్యేగ్రహంలో నా యాల్లు మక్కిలిరగ తన్నారంటే నమ్మండి. తంతే తన్నారు....మా కమ్మని కూడెట్టి వోరు. ఇంక నాను చెప్పే దేం లేదు. మీకు దండాలు" అని కూర్చున్నాడు.

సభలోని కుర్రకారంతా పగలబడి నవ్వారు.

సభ ముగిసేక కరణం మున్సబులు కల్సుకున్నారు. వారి కలయిక ఎలక్ట్రాన్ ప్రొటాన్ల సమ్మేళనం వంటిది.

"చూశారా పంతులు గారూ ఈ మహర్షి పొగరు?"

"ఏమిటి నాయుడుగారూ?"

బ్రాహ్మడిది పై చెయ్యిగా వుండటం నాయుడైన మున్సబుకు ఎంతమాత్రం ఇష్టం వుండదు. పైగా దేశమంతా వాకబు చేసి వెంకట్రావు నాయుడని ఋజువు చేసుకున్నాడాయె !

"అతగాడే పెద్ద నాయకుడైనట్లు, మిగిలినవాళ్ళు వట్టి వాజమ్మలైనట్లూ... ఏం, వాడిగురించి నాలుగు ముక్కలు చెబితే ఆయన పుట్టేం మునిగిపోయింది చెప్పండి ? ఆ నోరులేని వాజెమ్మని సభముందు పెట్టి నవ్వుల పాల్జేసాడు" అని వాపోయాడు.

"వాడు నవ్వుల పాలైతే మన కేమండీ ?"

"అమ్మా ! అలా అనకండి. ఎంత కాదనుకున్నా వాడొకప్పుడు మీ పాలేరు. అందుకు మీకు; కొంత కాలమైనా ఈ వూళ్ళో వున్నందుకు నాకూ అభిమానం వుండొద్దు టండీ !"

"అయితే ఏవిటంటారు మీరు ?"

"మహర్షి ఆట కట్టించా లంటాను. ఇప్పుడు వెంకన్న మనచేతిలో చదరంగ ప్పావు."

"అక్షర జ్ఞానం లేని వాణ్ని ఒడ్డం పెట్టుకొని మహర్షిగారితో పోటీ పడ తారా ?"

"అక్షరా లెందుకండీ ? సంతకం చెయ్యటం.... కాస్త నాజూగ్గా మాట్లాడం నేర్చుకుంటే చాలదూ.... కరిణీకానికి చదువుగాని— నాయకుడు కాడానికి చదువెందుకండీ" తేల్చి పారేశాడు నాయుడుగారు.

"ఇంకోటుంది చూశారూ ! ఇంత వరకూ మనం జస్టిస్ పార్టీఅనీ దేశ ద్రోహులమనీ మహా ప్రచారం చేశాడు మహర్షి. ఈ దెబ్బతో అదంతా తుడిచి పెట్టుకు పోవాలి. మనం కూడ అధికార పక్షంలో చేరి పాగా వేసెయ్యాలి."

"ఇంతకాలం వ్యతిరేకులంగా...."

"అమ్మమ్మ ... ఆగండి, అక్కడాగండి. మన మెప్పుడైనా ఆ పార్టీ

మంచిదనిగాని...లేక ఈ పార్టీ చెడ్డదని గాని సభల్లో మాట్లాడామా? పోతే ప్రభుత్వ పక్షం అంతే!! అప్పుడూ ప్రభుత్వం వుంది గనుక ఆ పక్షం. ఇప్పుడీ ప్రభుత్వం గనుక .."

"ఏదో పెద్ద ప్లానుమీదే వున్న టున్నారు"

"పెద్ద ప్లానేమీ కాదండీ! అతి స్వల్పం"

అవున్లెండి. తల వెంట్రుకతో కొండను ముడిపేటేంత లౌక్యులు మీకంతా స్వల్పంగానే కనిపిస్తుంది. సరే! ఇహ చెప్పండి మరి?

"ఏముందండీ .... మన తాయారు లేదూ?"

అయితే ఏవిటన్నట్లు చూస్తున్నాడు కరణం.

"వెంకన్నకిచ్చి పునర్వివాహం చేసే స్తే పోలా?!"

చాలా సుళువుగా సెలవిచ్చారు మున్సబ్‌గారు. కాని కరణంగారి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది, ఆయన వాక్కు పడిపోయింది.

"మాట్లాడరేమండి మహానుభావా?" రెట్టించాడు.

అడక తైరలో పోకయి పోయారు కరణంగారు. నోరుజారి ఉన్న విషయం అంతా ఆనాడు నాయుడికి చెప్పాడు. ఆ అలుసును ఆసరాగా తీసుకునే యధేశ్చగా ఇంటికి రాకపోకలు సాగి స్తున్నా, ఏం రచ్చ చేస్తాడోనని చూసీ చూడనట్టు ఊరుకుంటున్నాడు. ఇప్పుడేం చెయ్యాలి. కాదంటే వూరంతా 'టాం టాం' వేస్తాడు అవునందామా అంటే, విధవా వివాహాలు తన యింటా వంటా లేవు. పోనీ కాస్త సాహసించి చేద్దామా అంటే కనీసం సవర్ణుడైనా కాకపోయే. పైగా ఒకప్పుడు తన పాలేరు. ఇలా తర్జన భర్జన చేసుకుని బేరీజు వేసు కుని చివరికి పోనీలెమ్మనుకున్నాడు. విధవా వివాహం, వర్ణాంతర వివాహం చేశానన్న కీర్తయినా దక్కుతుంది" అనుకున్నాడు.

మళ్ళీ మున్సబే అందుకున్నాడు.

"ఏం? మన ప్లాను బాగోలేదూ? వార్ధాలో గాంధీగారిచేత వివాహం జరి పించామంటే సంఘం దృష్టిలో ఇటు మీరు సంస్కారులుగానే గాక... అటు గాంధీగారి దృష్టిలో కూడ పడిపోతారు. మీ మేలు కోరే చెబుతున్నాను. ఇం దులో నాకు ఒరిగేదేమీ లేదు. విధం చెడ్డా ఫలం దక్కాలి" అని ఊరుకు న్నాడు.

ఎలాగైతేనేం చివరకు వెంకట్రా వుకు తాయారుతో మనువు కుదిరింది. మునసబు మనసు పండింది.

* * *

వెంకట్రావుకు గాంధీగారి చేతి మీదుగా తాయారేగాక 'సర్దార్' బిరుదు కూడ లభించింది. ఆ రోజే నిజమైన

స్వాతంత్ర్యం వచ్చినట్లు అనుభూతి పొందాడు వెంకట్రావు తన్నుల భయం లేకుండ తనింక తాయారుతో స్వతంత్రంగా వ్యవహరించ వచ్చు. 'స్వతంత్రం పర్థిలాల్లి' అని పెద్దగా అరవాలని పించింది వెంకట్రావుకు. దానర్థం తనకిప్పటికీ తెలియక పోయినా, ఆ విషయంలో అసలైన స్వాతంత్ర్యం వచ్చింది. నాయుడికని పాపం అతని కేం తెల్సు!

ఈ వివాహంతో గొప్పవాణ్నయి పోవాలని కలలుగన్న కరణం గార్ని గాంధీగారి దృష్టిలో పడకుండ జాగ్రత్త పడ్డాడు మున్సబు. తానే సర్వస్వమై గాంధీగారి ముందు తిరిగాడు.

పట్టుదొరకాలే గాని పైకిపాకి పోయే మేధస్సువున్న మున్సబు గాంధీగారి ప్రాపకంలో జిల్లా కాంగ్రెసుకు ప్రభువై కూర్చున్నాడు. పోటీలో మహర్షిగారు చిత్తుగా ఓడిపోయారు. అంతే కాదు ఊరవతలి పదెకరాలపొలంరాజకీయబాధితుడిగామహర్షిగారికిమంజూరైనసిఫార్సు చెల్లలేదు. అది సర్దార్ వెంకట్రావు ఖాయమైంది. అందులోని పాటిమట్టే పాతికవేలకు పైగా అమ్ముడుపోయిందని వినికిడి.

* * *

లాభదాయకమైన రాజకీయ రచ్చకు మూలమౌతుంది. సమాజానికి సంబంధించిన సామూహికమైన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు దానికి పరిష్కారాన్వేషణకి రాజకీయం వేదికగా పనికి వస్తుంది. కాని దాని ఫలితాన్ని అనుభవించే టప్పుడు మాత్రం సమాజదృష్టి సన్నగిలి స్వార్థంతోకూడిన పోటీ దాని స్థానంలో నిలుస్తుంది.

ఎన్నికల జాతర సమీపిస్తోంది. టికెట్లకోసం కొట్లాటలు ప్రారంభ మైనాయి.

ఈ కలుషిత వాతావరణంలో పోటీ చెయ్యాలనే కోర్కె మహర్షిగారికిలేదు. కాని జనం ఊరుకుంటారా?

"పార్టీలో తోడేళ్ళు తిష్టవేశాయి. మేకవన్నెతో మభ్యపెట్టి మంచివాళ్ళనే స్వాహా చేస్తూ వుంటే మీ రిలా ఊరుకుంటారా" అని ఎగదోశారు. సహజంగానే సేవా దృక్పథం వున్న మహర్షిగారు కాదన లేకపోయారు.

మహర్షిగారు టికెట్టుకోసం వేసిన దరఖాస్తు నిరాకరించబడింది. కొన్ని ప్రత్యేక కారణాలవల్ల అది సర్దార్ వెంకట్రావు కైవస మైంది. దేనికైనా సమర్థన అంటూ వుండాలిగా! అందుకే ముందు రాబోతున్న ఎగువసభ ఖాళీలో శ్రీమహర్షిగార్ని కూర్చోబెట్టాలని తీర్మానించబడింది. తీరా ఖాళీ ఏర్పడగానే రాష్ట్ర సంఘం ఆ స్థానానికి మున్సబు గార్నే నిర్ణయించింది.

* * *

సర్దార్ వెంకట్రావుగారు నాయుడి

గారితోబాటు మద్రాసునుంచి కర్నూలుకీ, అక్కడ్నుంచి హైదరాబాద్‌కు తమ శాసనసభ సీట్లకు అంటి పెట్టుకుని భద్రంగా వచ్చారు

ముఠా రాజకీయాల్లో పార్టీ రెండు ముక్కలయింది. మున్సబుగారు అధికార ముఠాలో చేరి అమాత్యులయ్యారు. క్రమ శిక్షణారాహిత్య కారణంగా మహర్షిగారు సాధారణ సభ్యత్వం కూడ లాక్కుని పార్టీ నుండి తరిమేశారు.

ఎం. ఎల్. ఎ. వెంకట్రావుగారు మంత్రిగారి అనుయాయుల్లో ముఖ్యులైనారు. ఇద్దరూ సోషలిజం కోసం సమస్థాయిలోనే కృషి చేస్తున్నారు. అంతా తాయారు చలవ! తాయారు చల్లని ఒడిలో కడుపులో చల్ల కదలకుండ కాలం దొర్లిస్తున్నాడు సర్దార్ వెంకట్రావు. మంత్రిగారి పుణ్యమా అని పదెకరాల పొలిటికల్ పొలం మరో పాతికెకరాలని కొన్నది. అదిగాక మరో యాభై ఎకరాల దేవుడి మాన్యం తొంభై తొమ్మిది సంవత్సరాల కౌలు రూపంలో వెంకట్రావుగారి ఇలాకాలోనే వుంది.

స్వాతంత్ర్యానికి రజతోత్సవాల వయసొచ్చింది. ఆ సందర్భంలో తామ్ర పతకాలతో సత్కరించ బడ్డారు స్వతంత్ర యోధులు.

సర్దార్ వెంకట్రావుగారు తామ్ర పతకం అందుకున్నారు. వారి త్యాగానికి ప్రతిఫలంగా ప్రభుత్వం రెండువందల రూపాయల పొలిటికల్ పెన్షను మంజూరు చేసింది. పాపం! మహర్షి గారు సాధారణ సభ్యులు కూడ కాదాయె. అందుకే రాగి బిళ్ళ కూడ నోచుకోలేదు.

ఎగువ సభను ఎత్తివేయాలనే ప్రతిపాదన వచ్చిందిట! అవునో కాదో వారికే తెలియాలి. ఎందుకైనా మంచిదని సర్దార్‌గార్ని పక్కకునెట్టి నాయుడుగారే పైనుండి కిందికి దిగి వచ్చారు. వారు ఖాళీ చేసిన కుర్చీలో ప్రస్తుతం తాయారు కూర్చుంది.

ఒకనాటి సహచరుడూ శ్రేయోభిలాషీ అయిన కరణంగార్ని గుర్తించటం కూడ మానేశారు మున్సబుగారు. కాని ఎంతైనా రక్త సంబంధం కదా – చెల్లెలు తాయారు చిన్నవీ పెద్దవీ ఏవో పనులుచేసి పెడుతూనే వుంది అన్నగారికి.

ఇక మహర్షిగారేమైనారని అడగటం అప్రస్తుతం. అడగటం ఎందుకులెండి – అందరు దేశభక్తుల్లాగే పాతబడి దేశద్రోహిగా దిక్కులేని చావుచచ్చివుంటారని అనుకోరాదూ”

గమనిక :

గ్రెషమ్స్‌లా (Greshm's Law) అనేది ద్రవ్య శాస్త్రంలో ఒక సిద్ధాంతం. ఆర్థిక విధానంలో రెండు రకాల కరెన్సీలు చెలామణిలో వుంటే, నాసిరకం. నాణ్యమైన కరెన్సీని బయటికి నెట్టేస్తుందని ఈ సిద్ధాంత సారాంశం.

—రచయిత